సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 3 | మే | 2025



దేవాదుల.. పరిష్కారమెలా..?

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్ వస్తున్నారు.

- 10లో▸



ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు.

- 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37°/25°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

15 వరకు టెన్త్ సప్లిమెంటరీ ఫీజు గడువు

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సబ్జెక్ట్‌ల వారీగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు.

మొదటి నెలలో 70 శాతం బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి అర్బన్: 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ మాసంలో బొగ్గు ఉత్పత్తి 70శాతమే సాధించారు. ఈ మేరకు శుక్రవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి ఏరియాలో ఉత్పత్తి వివరాలను శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గడిచిన మాసంలో ఏరియా ఉత్పత్తి లక్ష్యం 3.85లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా.. 2.70లక్షల టన్నుల బొగ్గును వెలికి తీసినట్లు తెలిపారు. 3.85లక్షల టన్నుల బొగ్గు రవాణాకు 3.25లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు వెల్లడించారు. టీసీ 2, 3 ప్రాజెక్ట్‌లో 1.35లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీయాల్సి ఉండగా 1.10లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని వెలికితీసినట్లు తెలిపారు. ఏరియాలో ఉత్పత్తిని పెంచడానికి ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎస్‌డీఎల్ పని గంటలను పెంచడానికి, రక్షణ నియమాలు పాటిస్తూ పని చేయాలని సూచించారు.

పునరుద్ధరణ పనుల పరిశీలన



రేగొండ: మండలంలోని తిరుమలగిరి, రామన్నగూడెం, కొత్తపల్లి బి, కొత్తపల్లిగోరి మండలంలోని కొనరావుపేట, జగయ్యపేట గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో వీచిన వర్షానికి చెట్లు విరిగి తీగల మీద పడడంతో స్థంభాలు విరిగి, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. కాగా శుక్రవారం విద్యుత్ పునరుద్ధరణ పనులను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. విరిగిపడిపోయిన స్తంబాల పునరద్ధరణ పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా అందించాలన్నారు. కార్యక్రమంలో సీజీఎం రాజుచౌహాన్, జీఎం సురేందర్, ఎస్ఈ మల్సూర్ నాయక్, డీఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈలు రాజు, వెంకటరమణ, సురేష్, విశ్వాసరెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రఘు శుక్రవారం ప్రారంభించారు. 14 సంవత్సరాల లోపు ఆసక్తిగల పిల్లలు ఈ శిబిరంలో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉదయం రెండు, సాయంత్రం రెండు గంటలపాటు జూన్ 6వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్కారి ప్రభాకర్, కోచ్ మోటం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

63 మంది పోలీసు సిబ్బంది బదిలీ

భూపాలపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా 63 మంది పోలీసు సిబ్బందిని వివిధ పోలీస్‌స్టేషన్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లపాటు పని చేసిన సిబ్బందికి స్థాన చలనం కల్పించారు. పోలీస్‌స్టేషన్లలో ఖాళీలను సిబ్బందికి తెలుపుతూ, సీనియారిటీ ప్రకారం ఆయా ఠాణాలకు కేటాయించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన బదిలీల్లో మొత్తం 63 మంది ట్రాన్స్‌ఫర్ కాగా 52 మంది కానిస్టేబుళ్లు, ఏడుగురు మహిళా కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు ఏఎస్సైలు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఓ వసీం ఫర్హాన, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లు.. వరదపాలు

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల్లోని వరి పంట పూర్తిగా నేలవాలిపోగా.. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ఆరబోసిన ధాన్యం పూర్తిగా వరదనీటిలో కొట్టుకుపోయింది. పలుచోట్ల కాంటాలు అలస్యంగా నిర్వహించడం.. మరికొన్ని ప్రాంతాల్లో తేమశాతం తగ్గడంకోసం రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబోశారు. ఈక్రమంలో కురిసిన వర్షపునీటిలో ధాన్యం కొట్టుకుపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పలు మండలాల్లో వడగండ్ల వాన

- కొనుగోలు కేంద్రాల్లో వందలాది క్వింటాళ్ల ధాన్యం
- నీటిలో కొట్టుకుపోయిన వైనం
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



మల్హర్ మండలం కొయ్యూరు కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యం



నాగారంలో కొట్టుకుపోయిన ధాన్యం

వారంరోజుల్లో మూడుసార్లు..

భూపాలపల్లి రూరల్: గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరికొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. మండలంలోని నాగారం, ఆజాంనగర్ కేంద్రాల్లో ధాన్యం కొంత మేర వరదకు కొట్లుకుపోగా.. కొంతభాగం తడిసి ముద్దయింది. వారంలో మూడుసార్లు వర్షం కురువడంతో ధాన్యం తడవడం, ఆరబెట్టడం పరిపాటిగా మారిందని, మాశ్చర్ రావడం, వర్షం కురువడంతో మళ్లీ ఆరబెట్టడంతో ధాన్యం కాంటా వేయలేదని రైతులు వాపోతున్నారు. ఈక్రమంలో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఎలాంటి నిబంధనలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు నాగారం, ఆజాంనగర్, కమలాపూర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

అపార నష్టం



ఇంటిపై కూలిన చెట్టు

కాటారం: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షం రైతులు, ప్రజలకు అపార నష్టం మిగిల్చింది. సుమారు మూడు గంటలపాటు వరణుడు బీభత్సం సృష్టించాడు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండల కేంద్రంలోని ఎర్రగుంటపల్లిలో చిలుముల శ్రీనివాస్‌కు చెందిన ఇంటిపై చెట్టు విరగిపడటంతో ఇల్లు ధ్వంసమైంది. మండల కేంద్రంలో పలుచోట్ల రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. గారెపల్లి, రేగులగూడెం, ధన్వాడ, దేవరాంపల్లి, గంగారం గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంకుషాపూర్‌లో మామిడి తోటల్లో చెట్లు విరిగిపడి మామిడికాయలు నేలరాలాయి. శంకరాంపల్లి, రేగులగూడెం, ధన్వాడ, జాదారావుపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. రాత్రిపూట ధాన్యం కాపాడుకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

తడిచిన ధాన్యాన్ని కొనాలి..



ఈ వారంలో మూడుసార్లు వర్షం కురిసింది. ధాన్యం మాశ్చర్ వచ్చిన తర్వాత వర్షం కురువడంతో మళ్లీ ఆరబోశాం. ఇప్పటికే 15 రోజులైంది. అధికారులు మాశ్చర్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులను ఆదుకున్నట్లు ఉంటుంది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలి.

- అశోక్, రైతు, నాగారం, భూపాలపల్లి

విరిగిన విద్యుత్ స్తంభాలు

భూపాలపల్లి: ఈదురు గాలులకు జిల్లాలోని 262 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. రేగొండ మండలంలో 81, చిట్యాల 20, మొగుళ్లపల్లి 4, భూపాలపల్లి 45, కాటారం 2, గణపురం 74, మహాముత్తారం 1, మల్హర్ మండలంలో 35 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎన్పీడీసీఎల్ అధికారులు రేయింబవళ్లు శ్రమించి విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు.



కాటారంలో వర్షానికి తడిసిన ధాన్యం

మాయదారి వరద!

- మహదేవపూర్‌లో రెండు గంటలపాటు భీకరవర్షం
- ఎర్రచెరువులోకి కొట్టుకుపోయిన ధాన్యం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. మహదేవపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎర్ర చెరువు వద్ద మహదేవపూర్‌కు చెందిన 175 మంది రైతులకు చెందిన సుమారు 13వేల క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ఈక్రమంలో అకస్మాత్తుగా వర్షబీభత్సం సృష్టించింది. రెండు గంటలపాటు మహదేవపూర్‌లో 66.2 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు అయింది. దీంతో అడవి నుంచి కాల్వ ద్వారా సరాసరి కొనుగోలు కేంద్రంలోకి వరదనీరు వచ్చింది. దీంతో ధాన్యం కొంత కొట్టుకుపోగా, మరి కొంత తడిసి పనికిరాకుండా అయింది. శుక్రవారం ఉదయం స్థానిక నాయకులు.. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలతో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సుమారు 60మందికి పైగా రైతుల ధాన్యం చెరువులోకి కొట్టుకుపోయింది. మండలంలో సుమారుగా 50కిపైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రాథమికంగా అంచనా ప్రకారం.. 2,590క్వింటాళ్ల ధాన్యం నష్టపోయినట్లు డీసీఓ(జిల్లా కోఆపరేటీవ్ అధికారి) వాల్యానాయక్ 'సాక్షి'కి తెలిపారు.

నాలుగెకరాల ధాన్యం చెరువులోకి..



మహదేవపూర్‌కు చెందిన దొడ్డిపట్ల రాములు నాలుగు ఎకరాల్లో యాసంగి వరిపంటను సాగు చేశాడు. రూ.10వేల చొప్పున కౌలుకు తీసుకొని పంట వేసి, ఎకరానికి రూ. 20వేల చొప్పున పెట్టుబడి పెట్టాడు. పంట బాగానే వచ్చిందని సంబురపడ్డాడు. కానీ వరద రూపంలో ధాన్యం ఎర్రచెరువులోకి కొట్టుకుపోయింది. 8 ట్రాక్టర్ల లోడు ఉండగా, ప్రస్తుతం రెండు ట్రాక్టర్లు మిగిలింది. అది కూడా తడిసింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

- దొడ్డిపట్ల రాములు, కౌలురైతు, మహదేవపూర్

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న ఆరు ఎకరాల్లో పంట సాగు చేశా. పంట బాగానే వచ్చింది. ఎకరానికి రూ.25వేల పెట్టుబడి పెట్టాను. పంట నోటికచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం వరదలో కొట్టుకుపోయింది. కొంత తడిసింది. మా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- పిడుగు కొమురయ్య, రైతు, మహదేవపూర్

నర్సరీల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- డీపీఓ వీరభద్రయ్య



నర్సరీని పరిశీలిస్తున్న వీరభద్రయ్య

రేగొండ: వేసవిలో నర్సరీల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య సూచించారు. మండలంలోని రంగయ్యపల్లి గ్రామపంచాయతీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు చనిపోకుండా చూడాలన్నారు. అనంతరం కొడవంటచ గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జీవిత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



సెంటర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

మల్హర్: ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాడిచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోళ్లకు సంబంధించి ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ట్యాబ్ ఎంట్రీలను తక్షణమే పూర్తి చేయాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో ధాన్యం నిల్వ లేకుండా తక్షణమే కేటాయించిన మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు గురిచేయొద్దని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. కొనుగోలు జరిగిన తదుపరి రైతులకు బాధ్యత లేదని కేంద్రాలు ఇన్‌చార్జ్‌లు పూర్తి బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. సబ్ కలెక్టర్ మాయంక్‌సింగ్, డీఎస్ఓ శ్రీనాథ్, తహసీల్దార్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం: అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎర్ర చెరువు సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తడిసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సహకార శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నష్టపోయిన రైతుల పంటల వివరాలను నమోదు నివేదిక అందించాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, సహకార శాఖ అధికారి వాల్యానాయక్, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

భూపాలపల్లి: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలని తెలిపారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

అప్రమత్తంగా ఉండాలి

వేసవినేపథ్యంలో ప్రజలు ఎండల నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, వడదెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఇండ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు 108 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలు తినొద్దని తెలిపారు.

ఒక మండలాన్ని ఎంపిక చేయాలి..

మే 5 నుంచి 20 వరకు జిల్లాలోని ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచనలు, సలహాలు అందించారు. కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్‌కు 'సీఎంఆర్' చిక్కులు

- పెండింగ్‌లో గత రబీ, ఖరీఫ్ సీఎంఆర్ బియ్యం
- లక్ష్యానికి దూరంగా చాలామంది రైసుమిల్లర్లు
- గడువు పెంచినా కదలని సీఎంఆర్ బకాయి
- ఊపందుకున్న రబీ ధాన్యం కొనుగోళ్లు
- డిఫాల్టర్‌లకు సీఎంఆర్ ఇవ్వొద్దని సర్కారు ఆదేశం..
- 'ప్రత్యామ్నాయం'పై కసరత్తు

సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఓ రైసుమిల్లుకు 2021–22, 2022–23 సంవత్సరాలకు కేటాయించిన సీఎంఆర్ కింద 4,310 మె.టన్నుల బియ్యానికి 1,889 మె.టన్నులు మాత్రమే సరఫరా చేశారు. సుమారు రూ.7.50 కోట్ల విలువైన బియ్యం ఎగవేయడంతో అప్పట్లో సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి బియ్యం లేకపోవడంతో కేసులు నమోదు చేసి డిఫాల్టర్ లిస్టులో చేర్చారు.
- మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో గత సీజన్‌లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. అదే విధంగా కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.30 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించి కేసులు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైసు మిల్లర్లకు సరఫరా చేయాల్సి ఉండగా.. ఈసారి డిఫాల్టర్‌లకు ఇవ్వొద్దని ప్రభుత్వంనుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. 20 శాతం మిల్లర్లు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉంది. సివిల్ సప్లయీస్ అధికారులు వాటిపై పునరాలోచన చేస్తూ మిగతా మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నారు.



ధాన్యం దిగుబడుల అంచనాలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్‌లో 987 కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పాక్షికంగా సాగుతుండగా.. మిగతా జిల్లాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ధాన్యం అమ్ముకుంటున్న రైతులకు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మెనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్) ద్వారా డబ్బు బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నారు.

దాడులు, కేసులు పెట్టినా అదే మొండివైఖరి...

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని పలు జిల్లాల్లో కొందరు రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూకుమ్మడి తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గత రబీ సీజన్‌లో సీఎంఆర్ కోసం కూడా హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. వరంగల్ జిల్లాలోని ఓ మిల్లులో రూ.3.79 కోట్ల విలువైన 12,360 క్వింటాళ్ల పక్కదారి పట్టినట్లు గుర్తించి కేసు పెట్టారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్‌లో జరిపిన తనిఖీల్లో ఆరేడు సంవత్సరాలకు సంబంధించిన రూ.201 కోట్లకు పైగా విలువైన బియ్యం బకాయి ఉన్నట్లు వెల్లడించారు. కాగా ఇప్పటికే డిఫాల్టర్ జాబితాలో ఉన్న పలువురికి నోటీసులు జారీ చేశామని, 6ఏ కేసులు కూడా నమోదు చేశామని, అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టు కూడ పెడతామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

రబీ సీజన్ సీఎంఆర్ ఆచితూచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాయిల్డ్, రా రాస్ మిల్లులు 328 వరకు ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాలోని మిల్లుల నుంచి బకాయిలు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు రావాల్సి ఉందని ఫైనల్‌గా తేల్చారు. సీఎంఆర్ బకాయి ఉన్న డిఫాల్టర్‌లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వరాదన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్ 10.24 లక్షల మె.టన్నుల మేరకు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసిన అధికారులు 987 కొనుగోలు కేంద్రాల కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇన్‌టైమ్‌లో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకే సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డిఫాల్టర్‌గా ఉన్న రైసుమిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని సకాలంలో సీఎంఆర్ ఇచ్చిన మిలర్లకు తరలించడమా... లేక ఈ సీఎంఆర్ బకాయి రాబట్టుకుని అదనంగా జమానత్‌లు తీసుకుని వారికే ఇవ్వడమా... అన్న కోణంలో కసరత్తు చేస్తున్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- మంత్రి ధనసరి సీతక్క

ములుగు: వైకల్యమనేది కేవలం శరీరానికి మాత్రమేనని మనసుకు కాదని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ నీటి పారుదల శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గోవిందరావుపేట, వెంకటాపూర్ మండలాల పరిధిలోని బళ్ల సంజయ్, నాగయ్య, కృష్ణ, కందికట్ల సాంబయ్యకు రూ.2లక్షల విలువైన బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఉద్యోగాలు, ఉపాధికి ఏ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు. కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకంలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ శాలినీ మిశ్రా మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో ఈ ఉపకరణాలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ తదితరులున్నారు.



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

నిబద్ధతతో సేవ చేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి అని, అధికారులు నిబద్ధతతో ప్రజలకు చేసే సేవలతో గుర్తింపు వస్తుందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వర్తించి పదవి విరమణ చేసిన టి.శైలజ ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేయగా.. కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శైలజ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

విద్యారణ్యపురి : తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యంకనం హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు మూల్యంకనం కేంద్రాలుగా ఉండగా అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని హనుమకొండలో తోటబడిని ఎంపిక చేశారు. ఈనెల 5నుంచి 7వతేదీ వరకు టెన్త్ పరీక్ష జవాబుపత్రాల మూల్యంకనం, 8నుంచి 10వతేదీవరకు ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యంకనం జరుగుతుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం శుక్రవారం తెలిపారు.ఈ కేంద్రానికి టెన్త్ పరీక్షల జవాబు పత్రాలు 9,379 ఉండగా, ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాలు 16,286 కేటాయించారు. చీఫ్ ఎగ్జామినర్లుగా 13మంది, ఏఈలుగా 77మంది ఉపాధ్యాయులను, స్పెషల్ అసిస్టెంట్లుగా 13 మందిని నియమించామని సదానందం చెప్పారు.

భగవత్ భక్తే ప్రధాన మార్గం

హన్మకొండ కల్చరల్: పరమాత్ముడి సృష్టి మోక్షాన్ని పొందడానికి భగవత్ భక్తే ప్రధాన మార్గమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శుక్రవారం జగద్గురు ఆదిశంకరులు, శ్రీమద్ రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణలోని 'కుడా' గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వేదికపై ఆదిశంకరులు, రామానుజాచార్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి, ధన్వంతరి సేవా సమితి ఆధ్వర్యంలో గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 'కుడా' గార్డెన్స్‌లో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మిస్తామని అన్నారు.

అన్‌యూజ్డ్ పోస్టులపై తిరకాసు

వర్క్‌మెన్ పోస్టులు ఉన్నతీకరించడంతో వ్యతిరేకత
- కార్మిక శాఖకు ఫిర్యాదు.. 9న జాయింట్ మీటింగ్
- సబ్ స్టేషన్లలో ఆపరేటర్ల కరువు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



హన్మకొండ : అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై కార్మిక శాఖ విచారణ చేపట్టడంతో ఈ వివాదం ఎటువైపు తిరుగుతుందోనని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. వర్క్‌మెన్ క్యాడర్ పోస్టులను ఉన్నతాధికారుల పోస్టులుగా ఉన్నతీకరించడం వివాదస్పదంగా తయారైంది. విద్యుత్ ఉద్యోగులతో పాటు, కొన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక శాఖకు ఫిర్యాదు చేసింది. అన్‌యూజ్డ్‌గా ఉన్న వర్క్‌మెన్ పోస్టులను రెగ్యులర్ పోస్టులుగా క్షేత్ర స్థాయిలో భర్తీ చేసి భారం తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కోరితే ఇందులో కొన్నింటిని వర్క్‌మెన్‌గా, మరికొన్నిటిని పీ అండ్ జీ, ఇంజనీర్స్, అకౌంట్స్ విభాగం అధికారులకు పదోన్నతులకు అనుగుణంగా ఉన్నత స్థాయి పోస్టులు సృష్టిస్తూ నిర్ణయం తీసుకున్నారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయి, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు వృథాగా ఉంటున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై భారం పడుతోంది.

- కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న 215 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు, ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల 200 పోస్టులు.. మొత్తం 415 పోస్టుల స్థానంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, 20 జూనియల్ అకౌంట్స్ ఆఫీసర్, 88 సీనియర్ అసిస్టెంట్, 32 సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, 48 అసిస్టెంట్ లైన్‌మెన్, 88 ఆఫీస్ సబార్డినేట్, ఆరు స్వీపర్ పోస్టులుగా మార్చినట్లు సమాచారం. 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులుగా స్థిరీకరించారు.
- ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున కొత్తగా పోస్టులు సృష్టించడాన్ని క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వర్క్‌మెన్ క్యాడర్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో యూనియన్ నాయకులు మూడు నెలల క్రితం కార్మిక శాఖకు ఫిర్యాదు చేయగా దీనిపై వివరణ ఇవ్వాలని లేఖ రాసినా స్పందించలేదు. దీంతో ఈ నెల 9న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రాజేంద్ర ప్రసాద్ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అన్‌యూజ్డ్ పోస్టుల వ్యవహారం ఎటువైపు తిరుగుతుందో అని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

ఉద్యోగులపై అదనపు భారం

టీజీ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు 932 ఖాళీగా ఉండగా 25 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. కోర్టులో కేసు కారణంగా మిగతా పోస్టులు భర్తీ చేయలేదు. మిగిలిన 839 పోస్టుల్లో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నత స్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ అమోదానికి పంపినట్లు సమాచారం. కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్ల నియామకం చేపట్టకపోవడంతో అందుబాటులో ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందని, కొన్ని సబ్‌స్టేషన్‌లలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

అమ్మానాన్నే నాకు ప్రేరణ..

కుటుంబ సహకారంతోనే విజయం



- దారా మేఘన

'మా కుటుంబం న్యాయవిద్యతో ముడిపడినందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది. చిన్ననాటి నుంచి న్యాయశాస్త్రాన్ని చూసి పెరిగిన నేను, ఇప్పుడు అదే కుటుంబ పరంపరలో భాగంగా న్యాయం కోసం పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఇది నాకు బాధ్యతను గుర్తు చేస్తోంది, ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్న కర్తవ్యం కలిగిస్తోంది.' అని అంటున్నారు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన దారా మేఘన. ఇటీవల వెలువడిన న్యాయశాస్త్ర ఫలితాల్లో వరంగల్ దర్గా కాజీపేటకు చెందిన మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023 న్యాయ శాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ప్రయాణంపై 'సాక్షి' పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

-వరంగల్ లీగల్

- మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో లా ప్రొఫెసర్..
- తరచూ అక్కడి వాతావరణాన్ని చూపించేవారు..
- 'సాక్షి'తో దారా మేఘన
- ఇటీవల న్యాయశాస్త్ర ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక

ప్రశ్న: ఎల్ఎల్‌బీని ఎందుకు ఎంచుకున్నారు?

జవాబు : నేను న్యాయశాస్త్రాన్ని ఎంచుకోవడానికి కారణం మా నాన్నగారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే న్యాయవిద్యను నా వృత్తిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. జీవితమంతా ఆయన నాకు మోటివేషన్‌గా నిలిచారు. మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే నాకు లా స్కూల్ వాతావరణాన్ని, విద్యార్థులను చూడగల అవకాశం కలిగింది. ఇదంతా న్యాయశాస్త్రం పట్ల నాలో ఆసక్తిని, అభిమానం పెంచింది.

ప్ర : మీకు ప్రేరణ ఎవరు.

జ : మా తల్లిదండ్రులే నాకు ప్రేరణ. మా నాన్న న్యాయశాస్త్ర ప్రొఫెసర్, అమ్మ ఎల్ఐసీలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్నారు. వారి శ్రద్ధ, క్రమశిక్షణ నన్ను జీవితాన్ని సరిగ్గా ముందుకు నడిపించడంలో కలిసి వచ్చింది. ఏ రంగాన్ని ఎంచుకున్నా, దానికి ప్రోత్సాహం, స్వేచ్ఛను ఇచ్చారు. ఇక తమ్ముడు వంశీకృష్ణ ఎప్పుడూ నాకు మద్దతుగా నిలిచి, విద్యార్థినిగా ఎదుర్కొన్న కష్టాల్లో తోడుగా ఉన్నాడు. అలాగే, ప్రముఖ సీనియర్ అడ్వొకేట్ సి.విద్యాసాగర్ రెడ్డితో పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆయన నుంచి న్యాయశాస్త్రం ప్రాయోగిక అంశాల్లో మార్గదర్శనం పొందాను. ఈ రంగాన్ని ఎంపిక చేసుకోవాలని ఆయన అప్పట్లో ఇచ్చిన సలహా నా జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇంకా, మా కళాశాల నుంచి పెద్దగా విజయాలు సాధించిన మా సీనియర్లు తరణి వేముగంటి, నేహా అగర్వాల్ విజయాలను దగ్గరగా చూసే అవకాశం లభించింది. తరణి ప్రస్తుతం సిద్దిపేటలో జూనియర్ సివిల్ జడ్జిగా, అదనపు జేఎంఎఫ్‌సీగా పనిచేస్తున్నారు. నేహా అగర్వాల్ డీఎస్పీ పదవిని పొందారు. వారి మాటలు నాకు దిక్సూచి చూపాయి.

ప్ర : ఎందుకు న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు.

జ : న్యాయశాస్త్రం ద్వారా న్యాయం సాధించడమే కాక సమాజానికి సేవ చేయవచ్చని నమ్మి ఈ మార్గాన్ని ఎంచుకున్నాను

ప్ర : మీరు ఎదుర్కొన్న సవాళ్లు.

జ : నా ప్రయాణంలో ఒత్తిడి, ఆందోళన ఎదుర్కోవాల్సి వచ్చింది. సమయం కూడా చాలా పరిమితంగా ఉండటంతో, ఆ సమయంలోనే అన్ని విభాగాలను కవర్ చేయాలన్న ఒత్తిడితో ఉన్నా. ఇదే సమయంలో, మా తమ్ముడు అమెరికాకు మాస్టర్స్ కోసం వెళ్లిపోవడం కూడా నాకు భావోద్వేగపూరితంగా కష్టంగా అనిపించింది. అయితే, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అండగా నిలిచి నా అడ్డంకులను అధిగమించడంలో సహాయం చేశారు.

ప్ర : మీ నెక్ట్స్ గోల్?

జ : ఇప్పటినుంచి నా లక్ష్యం అత్యంత నిజాయితీగా, సమగ్రతతో సేవ చేయడం. న్యాయం వేగంగా అందించడానికీ, ఆలస్యం లేకుండా ప్రజలకు న్యాయం చేసేందుకు కట్టుబడి పని చేయాలనుకుంటున్నాను. నాకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, తమ్ముడికి, స్నేహితులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఈ విజయాన్ని నాతో కలిసి పంచుకున్న బంధువులకు కూడా ధన్యవాదాలు.



'జంపన్న'కు జలకళ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలోని జంపన్న వాగు నీటితో కళకళలాడుతోంది. గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో జంపన్న వాగులోకి వరద చేరింది. మొన్నటి వరకు చుక్కనీరు లేక ఎండిపోయి..ఇసుక దిబ్బలను తలపించింది. ఎగువ ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం పడడంతో జంపన్నవాగులోకి వరద చేరి జలకళ సంతరించుకుంది. శుక్రవారం అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి వచ్చిన భక్తులు జంపన్న వాగు నీటిలో పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోయారు. జంపన్న వాగులోకి వరద ప్రవహిస్తుడడంతో భక్తులు స్నానాలు ఆచరించే క్రమంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా జంపన్నవాగులో ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని పూజారులు కోరుతున్నారు.

బక్కమ్మ@105



- బక్కమ్మ



బక్కమ్మ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి 105వ జన్మదిన సంబరాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధురాలైన చీమల బక్కమ్మ 104 సంవత్సరాల వయస్సును పూర్తి చేసుకుని 105వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కతాటిపైకి చేరుకుని శుక్రవారం గ్రామంలో ఆనందోత్సవాల నడుమ జన్మదినాన్ని నిర్వహించారు. బక్కమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరి తరపు కుటుంబమంతా (121) మంది బుధరావుపేటలో శుక్రవారం కలుసుకుని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు



దాడిలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాజీపేట : కాజీపేట పట్టణంలో పర్వతలాల్ ఐస్‌క్రీమ్ తయారీ, డిస్ట్రిబ్యూటర్ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు చేసి రూ.29,050 విలువ చేసే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాణ్యత పాటించకుండా ఐస్‌క్రీమ్‌ల తయారీ, గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లు, పాడైన ఐస్‌క్రీమ్‌లను పట్టుకున్నారు. దుకాణం యజమాని నమ్తాబాద్ అమర్‌నాథ్‌పై తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

దేవాదుల.. పరిష్కారమెలా?

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష
- మూడో దశలో భూసేకరణే అసలు సమస్య..
- దేవన్నపేట పంపుహౌస్, ధర్మసాగర్ సందర్శన

సాక్షి ప్రతినిధి, వరంగల్ : జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం 91 శాతం పూర్తయినా.. మూడో దశలో భూసేకరణతో పనులు ముందుకు సాగక అసంపూర్తిగా మిగిలుతోంది. ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని తొమ్మిది జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే ఈ పథకానికి పూర్తి స్థాయిలో మోక్షం కలగడం లేదు. గతేడాది ఆగస్టు 31న కన్నాయిగూడెం బ్యారేజీ వద్ద మంత్రులు, కలెక్టర్లు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి 2026 మార్చిలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 37 మండలాల్లో 5,56,722 ఎకరాలకు నీరిందించడం ఈ పథకం లక్ష్యం.

భూసేకరణే ప్రధాన సమస్య..

ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అయితే మూడో దశలో నిలిచిపోయిన భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు 20 ఏళ్లయినా అసంపూర్తిగానే ఉంటుంది. రైతులు ఎక్కువ పరిహారాన్ని డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి భూసేకరణకు అడ్డంకిగా మారాయి.

పెరుగుతున్న ప్రాజెక్టు అంచనా వ్యయం..

యాసంగి పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలకు నీరందించే సందర్భంలో పలుమార్లు మోటార్లు మొరాయించాయి. ఇదిలా ఉండగా 2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం, 2020 జూన్ నాటికి రూ.14,729.98 కోట్లకు పెరిగింది. 2023లో రూ.17,500 కోట్ల చేరుతుందని అంచనా వేశారు. ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా విపరీతంగా పెరుగుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తి భూసేకరణే అసలు సమస్యగా మారగా, 33,224 ఎకరాలకు 30,268 ఎకరాలు పూర్తి చేశారు. జనగామలో 945 ఎకరాలు, పాలకుర్తిలో 826, గజ్వేల్‌లో 230, నర్సంపేటలో 131, వర్ధన్నపేటలో 168 ఎకరాలు.. ఇలా మొత్తంగా 2,957 ఎకరాల సేకరణపై చిక్కుముడి వీడితే ప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం కానుంది.

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూ..

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:15 గంటల వరకు దేవన్నపేట పంప్ హౌజ్‌పై రివ్యూ చేయనున్నారు. అనంతరం 2:30 నుంచి 2.45 గంటల వరకు ధర్మసాగర్ రిజర్వాయర్ సిస్టర్న్, డెలివరీ టన్నెల్ పనులపై, 3గంటల నుంచి 3:30 గంటల వరకు వరద నియంత్రణ, భద్రకాళి చెరువు పూడిక తీత పనులపై సమీక్ష చేయనున్నారు. అలాగే 3:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పురోగతిలో ఉన్న నీటి పారుదల శాఖ పనులు, పౌర సరఫరాల శాఖ సమస్యలపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన అధికారులతో హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూ చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హనుమకొండ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

చెరువులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

- కంబాలపల్లిలో ఘటన



భాస్కర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో పెద్దచెరువు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భవానీనగర్ తండాకు చెందిన జాటోత్ భాస్కర్ (35) ముత్యాలమ్మ గుడి సమీపంలో గల చికెన్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర్ తన తమ్ముడు రవి, మిత్రులు కోటి, నరేష్, రమేష్, వెంకటేష్, రాజుతో కలిసి గురువారం కంబాలపల్లి పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. అందరితో పాటు భాస్కర్ కూడా ఈత కొట్టేందుకు పెద్ద చెరువులోకి దిగాడు. ఈత కొడుతూ కొంత దూరం వెళ్లాక గమనించిన తోటి మిత్రులు అతడిని బయటికి రమ్మని పిలిచిన పట్టించుకోకుండా ఉన్నాడు. అంతలోనే భాస్కర్ నీటిలో మునిగి కనిపించకుండా పోగానే వెంటనే వారు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలించారు. శుక్రవారం ఉదయం భాస్కర్ మృతదేహం నీటిపై తెలియాడుతూ కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు ట్రెయినీ ఎస్సై పి.నరేష్, కానిస్టేబుల్ లింగారావు కేసు నమోదు చేశారు.



అనాథలైన స్వరూప, రిషిత, వర్షిత

అనాథలైన ముగ్గురు కుమార్తెలు..

భాస్కర్ మృతితో అతడి ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు. మద్యానికి బానిసైన భాస్కర్ కుటుంబ తగదాలతో 2022లో తన భార్య కల్పనను జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీ కట్టిలమ్మండె సమీపంలో ఆమె గొంతుకోసి హత్య చేశాడు. అదే కేసులో భాస్కర్ జైలుకు వెళ్లగా అప్పటినుంచి కుమార్తెలు స్వరూప, రిషిత, వర్షిత కొద్దిరోజులు అమ్మమ్మ ఇంటి వద్ద, నాయనమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. రెండేళ్ల క్రితం తల్లి కల్పన, ప్రస్తుతం తండ్రి భాస్కర్ మృతితో ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు.

అదృశ్యమైన బాలుడు చెరువులో శవమై..

- అనుమానాస్పదంగా చిన్నారి మృతి
- లక్ష్మణ్‌తండాలో విషాద ఛాయలు



జాన్‌పాల్ (ఫైల్)

గూడూరు : రెండ్రోజుల క్రితం తండ్రితో ఆటోలో వస్తూ కనిపించకుండా పోయిన బాలుడు శుక్రవారం చెరువులో శవమై తేలాడు. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్‌తండాకు చెందిన బాలుడు వాంకుడోత్ జాన్‌పాల్ (6) తండ్రి కృష్ణమూర్తితో కలిసి ఆటోలో వస్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గాలిస్తుండగా, సీతానగరం శివారు రాళ్ల చెరువులో శవమై కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నీటి సంపులో పడి చిన్నారి..

- సాయినగర్‌లో విషాద ఘటన



ఆర్యన్ (ఫైల్)

ఎల్కతుర్తి : ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం సాయినగర్ నూతన గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. (కొత్తపల్లి) సాయినగర్ గ్రామానికి చెందిన కూన రాకేశ్-రవళి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాకేశ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. తల్లి రవళి వంటపనిలో నిమగ్నమైంది. కుమారుడైన ఆర్యన్ (11 నెలల బాలుడు) ఇంటి ఆవరణలో అరుగుపై ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. బాలుడిని ఎవరూ గమనించకపోవడంతో ఆర్యన్ మృతిచెందాడు. ఇంటికొచ్చిన బాలుడి తండ్రి రాకేశ్ నీటి సంపు దగ్గరకు వెళ్లగా.. అందులో ఆర్యన్ మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

డంపింగ్ యార్డులో మగశిశువు మృతదేహం



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ : మడికొండ-రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డులో నవజాత శిశువు మృతదేహం లభించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ శుక్రవారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. డంపింగ్ యార్డులో పని చేస్తున్న సిబ్బందికి శిశువు మృతదేహం కనిపించగా మడికొండకు చెందిన బైరి లింగమూర్తికి సమాచారం ఇచ్చారు. లింగమూర్తి వెంటనే ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు విషయం తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిషన్ మృతదేహాన్ని పరిశీలించి చనిపోయినది మగ శిశువుగా గుర్తించారు. లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. శిశువు మృతదేహం ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియడం లేదని, నగరంలోని ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి పడేశారా లేక ఇతరులు ఎవరైనా పడేశారా అని పరిశీలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

వరి కోత మిషన్ కింద పడి రైతు..



ఇస్లావత్ రావుజ్య మృతదేహం

నర్సంపేట : వరి కోత మిషన్ (హార్వెస్టర్) కింద పడి రైతు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని మగ్దుంపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మగ్దుంపురం గ్రామానికి చెందిన రైతు ఇస్లావత్ రావుజ్య (55) గ్రామ శివారులో వరి కోత మిషన్‌తో వరిపైరును కోయిస్తున్నాడు. కోత మిషన్ వెనకాల ఉన్న రావుజ్యను డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీశాడు.ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రావుజ్య కింద పడడంతో వెనకాల టైర్ తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో రావుజ్య తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జానకి, కూతురు ఉన్నా రు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట పోలీసులు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పది మందికి గాయాలు



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని అప్పాల వీధిలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న పది మందిపై దాడి చేసి గాయపర్చింది. వారిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించి ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. గ్రామస్తులు ఆ పిచ్చికుక్కను చంపేశారు.